



ఉష్ణోగ్రత (అంచనా)

8-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	26
తెనాలి	40	27
నరసరావుపేట	39	25
బాపట్ల	38	27
రెంటచింతల	39	26
చీరాల	38	27

సాంకేతిక విద్యకు.. నిధుల సమస్య!

ఉమ్మడి గుంటూరు జిల్లాకే తలమానికం నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల. ఏకైక ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల కూడా ఇదే. ప్రతిభ కలిగిన విద్యార్థులకు సాంకేతిక విద్య అంతంతమాత్రంగానే అందుతోంది. కళాశాలలో వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. నిధుల కొరత వెంటాడుతుండడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఏళ్ల తరబడి కళాశాల, వసతి గృహ భవనాల నిర్మాణాలు సాగుతూనే ఉన్నాయి.



- నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో వసతుల కొరత
- రూ.8 కోట్లు ఇస్తేనే వసతి భవనాల నిర్మాణం
- కళాశాల భవనాలకు రూ.30 కోట్లతో ప్రతిపాదనలు
- నిధులు మంజూరులో జేఎన్‌టీయూ మీనమేషాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల కాకినాడ జేఎన్‌టీయూ నిర్లక్ష్యానికి గురైంది. కళాశాలను అభివృద్ధి చేయడం యూనివర్సిటీ అధికారులకు ఇష్టం లేదన్నట్లుగా ఉంది. స్థానిక కళాశాలకు రూ.8 కోట్లు నిధులు విడుదల చేస్తేనే వసతి గృహాల నిర్మాణాలు పూర్తవుతాయి. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో కళాశాల, వసతి గృహ భవనాల నిర్మాణాలను పూర్తి చేయలేకపోయింది. కళాశాల భవనాలు కూడా అరకొరగానే పూర్తయ్యాయి. వసతిగృహాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అసంపూర్తి భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు.



సాగుతూనే ఉన్నాయి..

నరసరావుపేట కళాశాల భవనాల నిర్మాణానికి కాకినాడ జేఎన్‌టీయూ రూ.90 కోట్లు మంజూరు చేసింది. రూ.28 కోట్లతో పరిపాలన, ప్రయోగశాలలు, తరగతి గదుల నిర్మాణాలను చేపట్టారు. ఆరేళ్లగా నిర్మాణ పనులను సాగదీస్తున్నారు. తరగతులు నిర్వహించేందుకు వీలుగా పనులు పూర్తి చేశారు. పూర్తిస్థాయి భవనాల నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. మూడు ఫ్లోర్లలో రెండుఫ్లోర్లు మాత్రమే పూర్తి చేశారు. మరో అంతస్తు నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. దాదాపు రూ.30 కోట్లు నిధులు మంజూరు చేస్తేనే భవనాల నిర్మాణం పూర్తయ్యే పరిస్థితి ఉంది. ఈ దిశగా వర్సిటీ స్పందించడం లేదు. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల లో చేరేందుకు విద్యార్థులు పోటీ పడతారు. అయితే వసతి సౌకర్యాలు లేకపోవడంతో ఆ పరిస్థితి ఇక్కడ కన్పించడం లేదు.


నిర్మాణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్

ప్రతిపాదనలు వెళ్లాయి.. నిధులు రావాలి

ఇటీవల జేఎన్‌టీయూ వీసీ కళాశాలను సందర్శించారు. వసతి గృహాల నిర్మాణం పూర్తి చేస్తామని విద్యార్థులకు ఆయన హామీ ఇచ్చారు. నరసరావుపేట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాలకు రావడానికి విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వసతి గృహాలకు సంబంధించిన రివైజ్డ్ అంచనాలను వర్సిటీ అధికారులకు అందించామని సంబంధిత ఇంజనీర్ శ్రీనివాసరావు తెలిపారు. నిధులు కేటాయిస్తేనే వసతి గృహాలను రానున్న విద్యా సంవత్సరానికి వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. కళాశాల మూడో అంతస్తుకు రివైజ్డ్ అంచనాలను రూపొందించి, వర్సిటీకి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.


అసంపూర్తిగా బాలికల వసతి గృహం

ఒక కుటుంబం.. రెండు రేషన్ కార్డులు



- 12 ఏళ్ల బాలుడికి మంజూరు చేసిన గత పాలకులు
- దరఖాస్తు చేసుకోకపోయినా మంజూరైందన్న కుటుంబీకులు

రొంపిచర్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు కోసం ఎందరో ఎదురు చూస్తుంటారు. వివాహమైనా తమను వేరు చేసి ప్రత్యేకంగా కార్డు ఇవ్వాలని పలువురు అర్జీలతో అభ్యర్థిస్తుంటారు. కానీ గత ప్రభుత్వంలో కావాల్సిన వారికి ఇష్టారీతిన రేషన్ కార్డులు మంజూరు చేసిన ఘటనలు తాజాగా వెలుగుచూస్తున్నాయి. మండలంలోని సంతగుడిపాడులో గత ప్రభుత్వ హయాంలో 12 ఏళ్ల బాలుడి పేరుతో పాటు వారి తల్లిదండ్రుల పేరుతో మరో కార్డు మంజూరైంది. దీంతో లింగంగుంట్ల రమేష్, కెజియ దంపతుల కుటుంబంలో రెండు కార్డులు ఉన్నట్లు వెలుగుచూసింది. వీరికి యశ్వంత్, నవీన్, లోకేశ్ సంతానం కాగా రేషన్ కార్డు కోసం రమేష్ దంపతులు దరఖాస్తు చేసుకున్నారు. కాగా భార్య కెజియా పేరుతో రేషన్ కార్డు మంజూరైంది. అందులో నవీన్, లోకేశ్‌ల పేర్లు ఉన్నాయి. అయితే 12 ఏళ్ల యశ్వంత్ దరఖాస్తు చేసుకోక పోయినా 2021లో అతడి పేరుతో ప్రత్యేకంగా మరో కార్డు మంజూరైంది. అయితే తమ కార్డులోనే యశ్వంత్ పేరును జత చేయాలని అప్పటి నుంచి సచివాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని రమేష్ తెలిపారు. తాజాగా సచివాలయం వెళ్తే అక్కడి సిబ్బంది పొంతన లేని సమాధానం చెపుతున్నారన్నారు. తాము దరఖాస్తు చేసుకోక పోయినా రేషన్ కార్డు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.

రోడ్ల విస్తరణకు చర్యలు చేపట్టాలి

- వినుకొండలో ట్రాఫిక్ సమస్యపై చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, మే 7 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణంలో రోడ్ల విస్తరణకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్ర బోస్, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి బుధవారం జీవీ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ పెరుగుతుందని రోడ్లపై అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద 35 నుంచి 70 అడుగులకు రోడ్డును విస్తరించాలన్నారు. మండల పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న దుకాణాలను అద్దెలకు ఇచ్చి మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమేరాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.


శివయ్యస్థూపం సెంటర్‌లో అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

తొండపిలో కార్డన్ సెర్చ్

- మారణాయుధాలు, బైక్‌లు స్వాధీనం

ముప్పాళ్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యాత్మక గ్రామమైన తొండపిలో బుధవారం సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతురావు ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని, గడ్డివాములు, అనుమానిత ప్రదేశాలను తనిఖీ చేశారు. తరచూ ఘర్షణలు, అల్లర్లు చోటుచేసుకుంటున్నాయి. మంగళవారం ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో ముందస్తు చర్యలలో భాగంగా పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్డన్‌సెర్చ్‌లో ఎటువంటి పత్రాలు లేని 35 ద్విచక్ర వాహనాలను, కొన్ని మరణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు.


తొండపిలో ఆయుధాలను పరిశీలిస్తున్న డీఎస్పీ హనుమంతురావు, పోలీసులు

రూ.5 వేల కోట్లతో జాతీయ రహదారులు

- కొండమోడు-పేరేచర్ల రోడ్డు శంకుస్థాపనలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు

రాజుపాలెం, మే 7 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట లోక్‌సభ నియోజక వర్గ పరిధిలో రూ.5 వేల కోట్లతో 250 కిలోమీటర్లలో జాతీయ రహదారుల నిర్మాణాలు జరుగుతున్నట్లు ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు తెలిపారు. కొండమోడు-పేరేచర్ల రహదారి నిర్మాణానికి బుధవారం మండలంలోని రెడ్డిగూడెంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు మండలాలు తప్పితే మిగిలిన అన్ని మండల కేంద్రాలను కలుపుతూ జాతీ య రహదారులు ఉన్నట్లు చెప్పారు. గోదావరి జలాలను కుడికాల్వకు తీసుకువచ్చే పనులను సంవత్సరం లోపు ప్రారంభిస్తామన్నా రు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దశాబ్దాల కలైన కొండమోడు-పేరేచర్ల రహదారి నిర్మాణాన్ని ఎట్టకేలకు సాధించామన్నారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గుంతలు పూడ్చలేని ప్రభుత్వం నుంచి నేషనల్ హైవేలు నిర్మించే ప్రభుత్వం వైపుగా ప్రజలు అధికారం ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కృషి మరువలేనిదన్నారు. రెడ్డిగూడెం గ్రామానికి చెందిన మోనార్టీలు ఎంపీ, ఎమ్మెల్యేలను సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ హెచ్ ఈఈ సంజీవరాయుడు, ఆర్డీవో రమా కాంతరెడ్డి, మండల పార్టీ అధ్య క్షుడు పల్లపాటి పెద్దిరాజు, నాయకులు నాగేశ్వరరావు, బీమినేని వందనదేవి, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు నరసయ్య, అళ్ల అమరేశ్వరరావు, తాతా జయప్రకాష్ నారాయణ, వెంకట కోటయ్య ఉన్నారు.


రహదారి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ లావు ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ. యరపతినేని శ్రీనివాసరావు, భాష్యం ప్రవీణ్ తదితరులు

24/7.. వెలుగులే



నరసరావుపేటలోని జగనన్నకాలనీలో పగలు.. రాత్రి అన్న తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. పగలు వీధి దీపాలను ఆర్పకుండా వదిలేస్తున్నారు. కాలనీ మొత్తం 24/7 వందల సంఖ్యలో వీధిదీపాలు వెలుగుతున్నాయి. పగలు కూడా విద్యుత్ వెలుగులతో పెద్దఎత్తున వృథా అవుతోంది. లైట్లు పగలు వెలగకుండా నిరోధించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. ఈ దిశగా విద్యుత్, మున్సిపల్ అధికారులు స్పందించాలి.

- (నరసరావుపే, ఆంధ్రజ్యోతి)

బాపట్ల రైల్వే స్టేషన్‌లో.. బాంబు దాడి..! జరిగితే?


బాంబుదాడిలో గాయపడిన ప్రయాణికుడికి ఫస్ట్ ఎయిడ్ చేస్తూ..

- బాంబు దాడి, తదనంతర దృశ్యాల ఆవిష్కరణ
- ప్రయాణికుల రక్షణ.. క్షతగాత్రుల తరలింపు..
- పోలీసులు, డాగ్ స్క్వాడ్‌తో అంతా హడావుడి
- ఏం జరుగుతుందో అర్థం కాక జనాల్లో ఉత్కంఠ
- అరగంట తర్వాత అసలు విషయం వెల్లడి
- సన్నద్ధతపై స్టేషన్‌లో మాక్ డ్రిల్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లోకి ఉగ్రవాదులు చొరబడి.. ప్రయాణికులపై బాంబు దాడి చేశారని డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు బుధవారం ఉదయం 10:55 నిమిషాలకు ఓ ఫోన్‌కాల్ వచ్చింది. ఆయన కలెక్టర్, ఎస్పీలకు సమాచారం ఇవ్వడంతో పాటు పోలీసు, ఫైర్, మెడికల్ విభాగాలను క్షణాల వ్యవధిలో అప్రమత్తం చేశారు. సరిగ్గా ఐదు నిమిషాల వ్యవధిలో ఏఎస్పీ విఠలేశ్వర్, డీఎస్పీ, టౌన్, రూరల్ సీఐలతో పాటు ఏఆర్ పోలీసులతో కలిపి దాదాపు 40 మంది 11 గంటలకు బాపట్ల రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. వీరితో పాటు డాగ్ స్క్వాడ్ కూడా రంగంలోకి దిగింది. రెండు అంబులెన్సులతో పాటు మెడికల్ సిబ్బంది స్టేషన్ వద్దకు చేరుకున్నారు. రైల్వే పోలీసులతో కలిసి ఓ టీం ప్రయాణికులను సురక్షితంగా బయటకు తరలించడంపై దృష్టిపెడితే.. మరో టీం బాంబుదాడిలో తీవ్రంగా గాయపడిన వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించింది. పోలీసులు సకాలంలో స్పందించడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఇద్దరిని కాపాడగలగడంతో పాటు.. దాదాపు 34 మంది ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకురాగలిగారు. ఇదే సమయంలో సహాయక చర్యల పర్యవేక్షణకు కలెక్టర్ కార్యాలయం నుంచి ఓ టీం రంగంలోకి దిగింది. ఉగ్రవాదులు జిల్లా సరిహద్దులు దాటి పారిపోకుండా చెక్‌పోస్టులను అలర్ట్ చేశారు. బస్టాండు, రేల్వే స్టేషన్‌లలో తనిఖీలను నిమిషాల వ్యవధిలో చేపట్టారు. రైల్వే స్టేషన్ బయటే మీడియా సమావేశం ఏర్పాటు చేసి.. ఉగ్రవాదులు అమాయకులే లక్ష్యంగా బాంబు దాడులకు తెగబడ్డారని, ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు చేర్చగలిగామని ప్రజలెవరూ ఆందోళన చెందనవసరం లేదని డీఆర్‌వో గంగాధర్ గౌడ్ తెలిపారు. మరిన్ని ఉగ్రదాడులు జరిగే అవకాశమున్నట్లు తమకు సమాచారముందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. కొత్త ముఖాల కదలికలపై అనుమానాలు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అసలేం జరిగింది..?

ఈ దృశ్యాలన్నీ కూడా బాపట్ల రైల్వే స్టేషన్ వేదికగా బుధవారం ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు చోటు చేసుకున్నాయి. పదుల సంఖ్యలో పోలీసుల రంగ ప్రవేశం, అంబులెన్స్‌ల మోత, డాక్టర్ల హడావుడి, మరో వైపు డాగ్ స్క్వాడ్‌తో ఖాకీల ఉరుకులు పరుగులతో స్టేషన్‌లో ఉన్న ప్రయాణికులతో పాటు బయట ఉన్న ప్రజలకు అసలు ఏం జరుగుతుందో తెలియక కంగారు పడ్డారు. రైల్వే స్టేషన్‌లోకి ఉగ్రవాదులు ప్రవేశించి బాంబు దాడులు చేశారనే సమాచారం పట్టణమంతా పాకింది. అటు ప్రయాణికులు, ఇటు ప్రజల్లో ఏం జరుగుతుందో తెలియక ఒకటే ఆందోళన నెలకొంది. అరగంట పాటు సాగిన ఈ ఉత్కంఠకు పోలీసులు తర్వాత తెరదించారు. రైల్వే స్టేషన్‌లో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారని తెలుసుకున్న ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రైల్వేస్టేషన్‌లో మాక్ డ్రిల్ జరిగిన విధానంపై పోలీసులతో పాటు అన్ని విభాగాలు సమీక్ష నిర్వహించాయి.



అప్రమత్తంగా ఉండాలి

భారత్-పాకిస్థాన్ మధ్య దాదాపుగా యుద్ధ వాతావరణం నెలకొన్న పరిస్థితులు అందరికీ తెలుసుని, దీనిలో భాగంగా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు సన్నద్ధతపై మాక్‌డ్రిల్ నిర్వహించడం జరిగిందని ఏఎస్పీ విఠలేశ్వర్ తెలిపారు. ఇది మాక్‌డ్రిల్ అయినప్పటికీ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న ఇబ్బంది వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏఎస్పీ కోరారు.


మాక్‌డ్రిల్ అనంతరం అధికారులు

రాజధాని రైతులకు ఇచ్చినట్లుగానే పరిహారం

- ఎమ్మెల్యే ప్రవీణ్ హామీ.. భూ సమీకరణకు అంగీకరించిన రైతులు

అమరావతి, మే 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి రైతులకు ఇచ్చినట్లుగానే పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. దీంతో రెండో దఫా భూ సమీకరణ ద్వారా భూములిచ్చేందుకు రైతులు అంగీకరించారు. మండల పరిధిలోని కర్లపూడి, లేమల్లె గ్రామాల్లో బుధవారం జరిగిన గ్రామసభలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ డిమాండ్లను ఎమ్మెల్యేతో పాటు రెవెన్యూ అధికారులకు వివరించారు. భూముల ధరలు పెరిగిన దృష్ట్యా గతంలో ఇచ్చిన దానికన్నా అదనంగా గజాలు పెంచాలని, కౌలు ఇవ్వాలని, రిటర్నబుల్ ప్లాట్లకు ఋణ సదుపాయం ఇవ్వాలని, ఇన్నర్‌రింగ్ రోడ్, రైలు మార్గం కన్నా లోపలి వైపు ప్లాట్లు మంజూరు చేయాలని కోరారు. తమ భూములను ఐటీ లేదా పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భూసమీకరణకు అనుమతించారన్నారు. వీలైనంత వరకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో భూ సమీకరణకు తామంతా సిద్ధమేనని అంగీకరిస్తూ కర్లపూడిలో ఎమ్మెల్యేకు గ్రామస్తులు సన్మానం చేశారు. ఈ సమావేశంలో తహసీల్దారు డానియేలు, ఎంపీడీవో శివపార్వతి, సర్వేయర్ బాగ్యలక్ష్మి, సర్పంచ్‌లు పద్మజ, ఉగ్గం పున్నమ్మ, ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.


కర్లపూడి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

నిలువునా ఎండిపోతోన్న భారీ వృక్షాలు

చెద భారీ వృక్షాలను చంపేస్తోంది. ప్రధాన రహదారుల వెంట ఉన్న పెద్దపెద్ద చెట్లకు చెద సోకడంతో అవి నిలువునా ఎండిపోతున్నాయి. యేటా పచ్చదనం పేరుతో రూ.కోట్లు ఖర్చు చేస్తున్న అధికారులు చెదల నివారణకు అధికారులు కనీస చర్యలు తీసుకోవడంలేదు. దశాబ్దాల వయస్సు ఉన్న భారీ వృక్షాలకు చెదలు సోకు తుండటంతో కూలిపోతున్నాయి. అటవీ, రోడ్లు-భవనాల శాఖల అధికారులు రోడ్ల వెంట ఉన్న భారీ వృక్షాలను చెదల నుంచి కాపాడేందుకు చర్యలు చేపట్టాలని వృక్ష ప్రేమికులు, ప్రజలు కోరుతున్నారు.

- (నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)



ఉప్పలపాడు వద్ద చెద కారణంగా ఎండిపోయిన భారీ వృక్షాలు

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ వేణుబాబు

మాచర్లటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో సొంతిల్లు ఉండి వ్యక్తిగత మరుగుదొడ్డి లేనివారు మరుగుదొడ్డి నిర్మాణం కొరకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు అన్నారు. లబ్ధిదారులకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ. 15వేల సబ్సిడీ మంజూరు చేస్తామన్నారు. సంబంధిత సచివాలయంలో దరఖాస్తు ఫారం, బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు నకళ్లను ఈనెల 12వ తేదీలోగా అందించాలని సూచించారు.

గ్రామాల్లో ప్రశాంతతకు పల్లె నిద్ర

● ఎస్ఐ సుధీర్‌కుమార్



పల్లెనిద్రలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ సుధీర్‌కుమార్

దుర్గి, మే 7(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ సుధీర్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని ఆత్మకూరు గ్రామ ఎస్సీ కాలనీలో పల్లె నిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుధీర్‌కుమార్ గ్రామస్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసి మెలిసి ఘర్షణలు లేని గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. కోపతాపాలకు వెళ్లి గొడవలు సృష్టించవద్దని, ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి..

దుర్గి, మే 7(ఆంధ్రజ్యోతి): నూతన రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ ఫణీంద్రకుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నూతన రేషన్‌కార్డుల జారీతోపాటు కార్డు విభజన, చిరునామాల మార్పు, పేర్ల తొలగింపు, కొత్త సభ్యుల చేరిక, కార్డులను సరెండర్ చేయడం తదితర ఆరు రకాల సేవలు అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ నెల రోజులపాటు ఉంటుందన్నారు. ఈకేవైసీ పూర్తయిన నేపథ్యంలో నూతన రేషన్‌కార్డులకు అవకాశం కల్పించారన్నారు. ఈకేవైసీ పూర్తయిన వారు నూతనంగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఈనెల 12వ తేదీ తర్వాత వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. జూన్‌లో క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రైస్ కార్డులను జారీ చేస్తారన్నారు. ప్రక్రియ పూర్తయిన తరువాత దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఈ కార్డుకు వెసులుబాటు కల్పిస్తుందన్నారు.

● మాచవరం, మే 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతన రేషన్ కార్డుల కోసం, చేర్పులు, మార్పులు కోసం అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. నూతనకార్డులు, చేర్పులు, మార్పుల కొరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందన్నారు. ఆయా గ్రామ సచివాలయాల్లో అన్ని వివరాలతో అర్జీలు అందజేయాలని తహసీల్దార్ తెలిపారు.

● పిడుగురాళ్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామంలో రేషన్‌కార్డు కోసం లేనివారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జె.మధుబాబు తెలిపారు. నూతనంగా పెళ్లైనవారు, రేషన్‌కార్డులో పేర్లు చేర్చడం, తొలగించడం, ఆధార్ సీడింగ్ మార్చడం, చిరునామా మార్చడం వంటి వాటికోసం వార్డు, గ్రామాలలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

ఆధార్ కేంద్రాల నిర్వహణపై ప్రచారం నిర్వహించాలి

మాచవరం, మే 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆధార్ కేంద్రాల నిర్వహణపై కొన్ని గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో వెంగళరావు ఆదేశించారు. బుధవారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు వావారి గ్రామాల్లో టాంటాం ద్వారా, మైకుల ద్వారా ప్రజలకు సమాచారం చేరవేయాలని సూచించారు. ప్రస్తుతానికి మాచవరం, మోర్జంపాడు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాల నిర్వహణ జరుగుతోందన్నారు.

దాచేపల్లి పీఏసీఎస్‌లో ఆధార్ సేవలు

దాచేపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): ఆధార్ నమోదుకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని దాచేపల్లి పీఏసీఎస్ ఇన్‌చార్జ్ ఐపీసీ కడప శ్రీనివాసరావు, దాచేపల్లి పీఎస్ఎస్‌సీ ఈవో కాశివరపు సాంబశివరావు కోరారు. ఐదు నుంచి ఏడు సంవత్సరాల వరకు, 15 నుంచి 17 సంవత్సరాల వయస్సు గల చిన్నారుల కోసం ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్టు వివరించారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

నకరికల్లు, మే 7(ఆంధ్రజ్యోతి): బైక్‌పై వస్తున్న వ్యక్తిని లారీ ఢీకొనటంతో మృతిచెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో గుండ్లపల్లి సమీపాన జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుండ్లపల్లి గ్రామానికి చెందిన కొలుముల రంజాన్ షరీఫ్ నరసరావుపేటలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. రోజు మాదిరి విధులకు హాజరై నరసరావుపేట నుంచి తన బైక్‌పై గుండ్లపల్లికి బయలుదేరాడు. గుండ్లపల్లి సమీపానికి వచ్చిన సమయంలో లారీ అతివేగంగా వచ్చి బైక్‌పై వస్తున్న రంజాన్ షరీఫ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రంజాన్‌షరీఫ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు హజ్ యాత్రికులకు ఆత్మీయ సన్మానం

దాచేపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకు వెళ్తున్న ముస్లింలకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నిర్వహిస్తున్నారు. గురువారం విజయభాస్కర కల్యాణ మండపంలో జరిగే ఈ కార్యక్రమంలో హజ్ యాత్రికులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఎమ్మెల్యే అందజేయనున్నారు.

రోడ్లు, బ్రిడ్జిల సమస్యలపై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



లబ్ధిదారులకు రైతు సాధికార సంస్థ ద్వారా విత్తనాల కిట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా, ఎంపీ లావు, కలెక్టర్ అరుణ్‌బాబు

సత్తెనపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి నియోజకవర్గంలో రోడ్లు, బ్రిడ్జిల సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో బుధవారం నియోజకవర్గస్థాయి అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ మండలంలోని లక్కరాజుగార్లపాడు రోడ్డులో శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి స్థానంలో కొత్తది నిర్మించాలని అధికారులకు సూచించారు. సత్తెనపల్లి-అమరావతి మార్గంలో నందిగామ వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో మంజూరైన గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సాగునీటి పారుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు సమిష్టి కృషితో పనిచేయాలన్నారు. వేసవిలో నీటి సమస్యలను ఎదుర్కొనేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పంచాయతీరాజ్ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా విద్యాశాఖ అధికారులతోపాటు అన్ని శాఖల అధికారులు చూడాలన్నారు. రెవెన్యూశాఖలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామన్నారు. జడ్పీ అధికారులు త్వరితగతిన పనులు పూర్తిచేయాలన్నారు. రైతులకు విత్తనాలు, యాంత్రిక పనిముట్లు, సబ్సిడీపై వచ్చే అన్ని పరికరాలను అందుబాటులో ఉండేలా చూడాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. రైతుసాధికార సంస్థ ద్వారా వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో 30 రకాల విత్తనాల కిట్లను కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు మురళీ, అమలకుమారి, రమణాకాంత్‌రెడ్డి, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

మనోధైర్యాన్ని పెంచిన ఆపరేషన్ సింధూర్

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): పహల్గామ్‌లో ఉగ్రదాడులకు ప్రతిగా భారత సైనిక దళాలు చేపట్టిన ఆపరేషన్ సింధూర్ భారతీయుల మనోధైర్యాన్ని పెంచిందని, అమరులైన భారతీయుల ఆత్మ శాంతించేలా సైనికులు ప్రతీకారం తీర్చుకున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం అర్ధరాత్రి భారత సైనికులు పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపై నిర్వహించిన దాడి భారతదేశ ధీరత్వాన్ని ప్రపంచానికి చాటిందన్నారు. ఉగ్రవాదుల ఏరివేతకు కంకణం కట్టుకున్న ప్రధాని మోదీకి, మద్దతుగా నిలిచిన సీఎం చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉగ్రవాదాన్ని అంతమొందించాలి

కారంపూడి, మే 7(ఆంధ్రజ్యోతి): అమాయక ప్రజల ప్రాణాలను బలిగొంటున్న ఉగ్రవాదం, దాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌పై బుధవారం యుద్ధ శంఖారావం పూరించిన కేంద్ర ప్రభుత్వానికి కూటమి నేతలు అభినందనలు తెలిపారు. మరోమారు అమాయకుల ప్రాణాలను బలిగొనకుండా.. ఉగ్రవాదం లేకుండా చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శెట్టి హనుమంతురావు, టీడీపీ నేతలు కర్లా అమర సైదారావు, మాజీ ఎంపీపీ దోర్నాల నాగిరెడ్డి, లక్ష్మీనారాయణ, లింగాల శ్రీనివాసరావు, నున్నా జనార్ధన్, జనసేన నేత రామాంజనేయులు బీజేపీ నేతలు కజ్జం పెద ఆంజనేయులు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళులు



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

సత్తెనపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా భారతదేశంలో సాయుధ తిరుగుబాటు చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని బుధవారం ఆర్డీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్, ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాలర్పించారు.

● క్రోసూరు, మే 7(ఆంధ్రజ్యోతి): విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం బుధవారం మండలంలోని పెరికపాడు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలదండలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకుడు జడ సుబ్బు, ఇజ్రాయేలు, దిలీప్ కుమార్, రామరావు, సర్వేశ్వరరావు, వెంకటరావు, భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకటరావు మృతి పార్టీకి తీరనిలోటు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి



వెంకటరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

పెదకూరపాడు, మే 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు వెంకటరావు మృతి పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. పెదకూరపాడుకు చెందిన టీడీపీ నాయకుడు కృష్ణమనేని వెంకటరావు మృతిచెందటంతో ఆయన మృతదేహాన్ని బుధవారం కొమ్మాలపాటి సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకోవాలి

రెంటచింతల, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం సత్రశాలలోని కృష్ణానది ఒడ్డున గల శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మెంబర్లకు దరఖాస్తు చేసుకోవాలని ఎండోమెంట్స్ ఈవో గాదె రామిరెడ్డి కోరారు. ఆసక్తిగలవారు 20 రోజుల లోపు పల్నాడు జిల్లా దేవదాయ శాఖాధికారికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాలు సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో లభ్యమౌతాయన్నారు.

22 పాడి గేదెల అపహరణ

రెంటచింతల, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటాల గ్రామంలో నలుగురు వ్యక్తులకు చెందిన 22 పాడి గేదెలను అపహరించుకుపోగా బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జున చెప్పారు. ఈ ఘటన గత నెల 26న జరిగింది. రాత్రివేళ కొట్టంలో కట్టేసిన గేదెలను తాళ్లు తీసి టాటా ఏసీ వాహనంలో పిడుగురాళ్ల సమీపంలోని చిన అగ్రహారానికి తరలించారు. 6 గేదెలను దుర్గి మండలం అడిగొప్పుల గ్రామానికి చెందిన వారికి విక్రయించగా వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాధితులైన కటికల సంసోన్, ఏసోబు, మరియమ్మ, పేరుపోగు అశోక్‌ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ట్రైకోడెర్మా విరిడితో తెగుళ్ల నివారణ

నకరికల్లు, మే 7(ఆంధ్రజ్యోతి): ట్రైకోడెర్మా విరిడి వాడటం వల్ల భూమి ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్ళను అరికట్టవచ్చని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. బుధవారం మండలంలోని చీమలమర్రిలో రైతు సేవా కేంద్రంలో విద్యార్థులు గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతులకు ద్రవరూపంలో ట్రైకో డెర్మా విరిడి తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. పొలానికి దీన్ని ఎప్పుడు వాడాలో రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీఏఏ జగదీష్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో పంట సాగు నిర్ధారణ



గురజాల: మట్టి నమూనాల సేకరణలో ఏవో సంధ్యారాణి

దాచేపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలతో పంటల సాగు నిర్ధారణ చేయాలని మండల వ్యవసాయ శాఖ ఏవో పాపకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని 2025-26 ఆర్థిక సంవత్సరానికి 840 మట్టి నమూనాలు సేకరించాలనే లక్ష్యంగా నిర్ణయించారు. 15 రైతు సేవా కేంద్రాల నుంచి 56 మట్టి నమూనాలను సేకరించాలని నిర్ణయించినట్టు తెలిపారు. నేలలో పోషకాల సమతుల్యతను పాటించటానికి భూసార పరీక్షలు దోహదపడుతాయి. రైతులు మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని ఆమె కోరారు.

మట్టి నమూనాల సేకరణ

గురజాలటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంటపొలాల్లో బుధవారం ఏవో సంధ్యారాణి ఆధ్వర్యాన మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 840 మట్టి నమూనాల సేకరణ లక్ష్యంగా ఉన్నందున 18 రైతు సేవా కేంద్రాలకు ఒక్కో కేంద్ర పరిధిలో 59 చొప్పున మట్టి నమూనాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. నేలలో పోషకాల సమతుల్యతను పాటించడానికి రసాయన ఎరువుల సక్రమ వినియోగానికి భూసారా పరీక్షలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

దాచేపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు తక్షణమే అమలుచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ శాఖ నారాయణపురంలో తమ్మిశెట్టి శ్రీరాములు అధ్యక్షతన సమావేశం జరిగింది. సూపర్-6 పథకాలను వెంటనే అమలుచేయాలన్నారు. వ్యవసాయ కూలీలకు 200 రోజులు ఉపాధిపనులు కల్పించాలన్నారు. నాగులేరుపై లో లెవల్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. నడికూడిలో ఉన్న అప్పర్ ప్రైమరీ స్కూల్ 7వ తరగతి వరకు కొనసాగించాలని తీర్మానించారు. అనంతరం నారాయణపురం శాఖ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సెక్రటరీగా పత్తిపాటి వెంకట నాగరాజును ఎన్నుకున్నారు. సమావేశంలో మందపాటి రమణారెడ్డి, కార్యదర్శి కొమెర వెంకటరావు, బుర్రి కృష్ణారెడ్డి, పత్తిపాటి వెంకట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సంక్షేమ అధికారిగా రాణిమ్మ



అవార్డును అందుకుంటున్న రాణిమ్మ

మాచర్లటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ కళాశాల వసతి గృహ సంక్షేమ అధికారి పొంగులూరి రాణిమ్మ ఉత్తమ అధికారిగా ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర సంక్షేమశాఖా మంత్రి డాక్టర్ డోలా వీరాంజనేయస్వామి నుంచి రాణిమ్మ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా రాణిమ్మకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందించారు. గురజాల సాంఘీక సంక్షేమ శాఖ సహాయ అధికారి వెంకట సుజాతకుమారి తదితరులు రాణిమ్మను అభినందించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 7(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం బుధవారం నాటికి 513.90 అడుగులు ఉంది. ఇది 138.38 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల...

అచ్చంపేట, మే 7(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 22.79 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.



టోర్నమెంట్ పోస్టరు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

పారిశ్రామిక అభివృద్ధితోనే ఉపాధి

ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, మే 7(ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, పారిశ్రామిక అభివృద్ధితోనే ఉపాధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మాచర్ల మండలం రాయవరం వద్ద ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కార్పొరేషన్ ఆధ్వర్యాన ఏర్పాటుచేస్తున్న ఇండస్ట్రియల్ పార్కు శంకుస్థాపన కార్యక్రమం గురువారం జరగనున్న నేపథ్యంలో బుధవారం వెల్దుర్తి క్యాంపు కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశమయ్యారు. మాచర్ల నియోజకవర్గం పారిశ్రామికంగా పురోగతి సాధించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. రాయవరం జంక్షన్ వద్ద ప్రభుత్వరంగ సంస్థ ఏపీఐఐసీ ఆధ్వర్యాన దాదాపు 7 ఎకరాల్లో అన్ని మౌలిక వసతులతో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేస్తున్నట్లు వెల్లడించారు. చిన్నతరహా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఈ పార్కులో తక్కువ ధరలకు స్థలాల కేటాయింపు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ డాక్టర్ ఎంఎల్ నరసింహారావు, డిప్యూటీ జోనల్ మేనేజర్ మధు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి ఆలిండియా వాలీబాల్ పోటీలు

మండలంలోని శిరిగిరిపాడులో శ్రీవీరాంజనేయస్వామి జయంతి సందర్భంగా ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు జాతీయస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. జాతీయ స్థాయిలో మహిళా, పురుషుల విభాగంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి కళ్లం రామాంజిరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు భరోసా సీఎం సహాయనిధి



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

బాధిత కుటుంబాలకు భరోసా సీఎం సహాయనిధి అని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం వెల్దుర్తిలోని క్యాంపు కార్యాలయంలో రూ.7లక్షల విలువైన చెక్కులను బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉండి, హాస్పిటల్ బిల్స్ కట్టలేని పేదలకు కూటమి ప్ర భుత్వం బాసటగా నిలుస్తుందన్నారు.

కిడ్నాప్.. దాడి

సత్తెనపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రఘురామ్ నగర్‌కు చెందిన మస్తాన్‌వలికి నాగన్నకుంటలో ఉంటున్న ప్రకాష్ అనే వ్యక్తి ఇంటి తాలూకా ఈఎంఐ డబ్బు రూ.70వేల వరకు చెల్లించాల్సి ఉంది. డబ్బు చెల్లించాలని మస్తాన్‌వలి, ప్రకాష్‌ను అడగటంతో ప్రకాష్, మస్తాన్‌వలిని మరో నలుగురితో కలసి సత్తెనపల్లిలో కిడ్నాప్ చేసి బెల్లంకొండ మండలంలో మస్తాన్‌వలిపై దాడిచేసి గాయపరిచారు. దీనిపై బుధవారం మస్తాన్‌వలి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రకాష్, మరో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మస్తాన్‌వలిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

క్రోసూరు ఎస్ఐగా రవిబాబు



పీ రవిబాబు

క్రోసూరు, మే 7(ఆంధ్రజ్యోతి): క్రోసూరు ఎస్ఐగా పీ రవిబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాచర్ల రూరల్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన నాగేంద్రబాబును వీఆర్‌కు పంపారు. రవిబాబు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పర్యవేక్షణకు కృషి చేస్తానన్నారు.

రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భూషణం



అచ్చంపేట, మే 7(ఆంధ్రజ్యోతి): చిత్తూరులో ఈ నెల 6వ తేదీన జరిగిన ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలో పీడీ గుడిపూడి భూషణం ఇన్‌చార్జ్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్టు భూషణం తెలిపారు. ఈయన అచ్చంపేట గురుకుల పాఠశాలలో పీడీగా పనిచేసి రిటైర్ అయ్యారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమన్వయ సమావేశం

అచ్చంపేట, మే 7(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కే శ్రీనివాస్ అధ్యక్షతన 2025-26 ఆర్థిక సంవత్సరానికి అగ్రికల్చర్, హార్టికల్చర్ సిబ్బందితో అన్ని గ్రామ పంచాయతీల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి తప్పనిసరిగా పది ఎకరాల పండ్లతోటల పెంపకం పనులు గుర్తించాలన్నారు. ఇది సన్న, చిన్నకారు రైతులకు ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో వెంకటేశ్వర్లు, హార్టికల్చర్ అధికారి నిత్య, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు

దాచేపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. దాచేపల్లిలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి సందర్భంగా శాంతిహోమం, లక్ష మల్లెలపూజ నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.బుజ్జి, సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

● పిడుగురాళ్ల, మే 7(ఆంధ్రజ్యోతి): శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి నవరాత్రుల మహోత్సవాలు ముగిశాయి. అమ్మవారికి విశేష పుష్పాలంకరణ గావించారు.కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు, దేవాలయ కమిటీ అధ్యక్షులు యేలూరి చంద్రశేఖరరావు, కొలిశెట్టి సుబ్బారావు, కొత్త లక్ష్మీనారాయణ, జూలకంటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



దాచేపల్లిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి మూలవిరాట్, పూజలో పాల్గొన్న మహిళలు

దుర్గిలో..

దుర్గి, మే 7(ఆంధ్రజ్యోతి): దుర్గిలో శ్రీవాసవీమాత జయంతి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ వేడుకలు జరిపారు. దంపతులు ప్రత్యేకపూజలు జరిపారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘీయులు కపలవాయి శ్రీనివాసరావు, పెద్ద మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కారంపూడిలో...

కారంపూడిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా సంఘం సభ్యులు స్వర్ణ కమలం, గుండా అంజనీదేవి కుటుంబసభ్యులు వెండి చిలుకను అమ్మవారికి బహూకరించారు. లక్ష పుష్పార్చన నిర్వహించారు.కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు మద్దు హనుమంతురావు, మహిళా కమిటీ అధ్యక్షురాలు ఇమ్మడిశెట్టి కోమలి పాల్గొన్నారు.



పిడుగురాళ్ల: విశేష పుష్పాలంకరణలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు, కుంకుమపూజలు నిర్వహిస్తున్న మహిళలు

అచ్చంపేటలో...

అచ్చంపేట, మే 7(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీవాసవి, శ్రీలలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సూరె వీరవెంకటమణికంఠ, సూరె రామలింగస్వామి, అనుమోలు శేషగిరిరావు, సూరె వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

రెంటచింతలలో..

రెంటచింతల, మే 7(ఆంధ్రజ్యోతి): శ్రీ వాసవి అమ్మవారి జన్మదినవేడుకలు ఆలయంలో నిర్వహించారు. లలితా, విష్ణు సహస్రనామ పారాయణం, పాలాభిషేకం, కుంకుమార్చన చేశారు. అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ చైర్మన్ కె.వెంకటనాగేశ్వరరావు కార్యవర్గ బృందం ఏర్పాట్లు పర్యవేక్షించింది.

గుంటూరు మీదగా చర్లపల్లి, బరంపురం ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, బరంపురం ప్రత్యేక రైళ్లను ఈ నెల, జూన్‌లో వారానికి ఒకసారి నడపనున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. (07027) చర్లపల్లి - బరంపురం ప్రత్యేక రైలు ఈ నెల 9, 16, 23, 30, జూన్ 6, 13, 20, 27 తేదీల్లో(ప్రతీ శుక్రవారం) రాత్రి 8.15 గంటలకు బయలుదేరి 11.44కి సత్తెనపల్లి, అర్ధరాత్రి దాటాక 12.40కి గుంటూరు, శనివారం మధ్యాహ్నం 2.15కి బరంపురం చేరుకుంటుంది. (07028) బరంపురం - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 10, 17, 24, 31, జూన్ 7, 14, 21, 28 తేదీల్లో(ప్రతీ శనివారం) సాయంత్రం 4.45 గంటలకి బయలుదేరి ఆదివారం వేకువజామున 4.33 గంటలకు గుంటూరు, 5.23కి సత్తెనపల్లి ఉదయం 11.35కి చర్లపల్లి చేరుకుంటుందని తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

రేపల్లె, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇసుకపల్లి 17వ వార్డుకు చెందిన మోపిదేవి సుమతి(41) బుధవారం నిమ్మ చెట్టుకు నీరుపోస్తూ విద్యుదాఘాతానికి గురైంది. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి కరెంటు రావడంతో షాక్ కొట్టి ఆమె మృతి చెందింది. పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు వివరాల మేరకు.. సుమతి ఇంటి వద్ద చెట్టుకు నీరు పోస్తూ.. కరంటు పోల్‌కు ఆనుకోవడంతో ప్రమాదం జరిగింది. ఆమెను కాపాడటానికి ప్రయత్నించిన కొడాలి పద్మ అనే మహిళ కూడా విద్యుత్‌షాక్‌తో స్వల్పంగా గాయపడింది. ఇది గమనించిన మృతురాలి భర్త శివనాగేశ్వరరావు ప్రభుత్వ వైద్యశాలకు సుమతిని తీసుకెళ్లగా.. ఆమె చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. సుమతి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైస్ కార్డుల పండుగ!



- ఏళ్ల తరబడి నిరీక్షణకు తెర.. లబ్ధిదారుల్లో సంతోషం
- కొత్తకార్డులు సహా.. 6 రకాల మార్పుచేర్పులకు అవకాశం
- హౌస్‌హోల్డ్ మ్యాపింగే కీలకమంటున్న అధికారులు
- వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం

గుంటూరు మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైస్ కార్డుల పండగ మొదలైంది. ఎప్పుడెప్పుడా అని ఏళ్ల తర బడి రైస్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న వేలాది మంది లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం, పౌర సరఫరాల శాఖ మంగళవారం తీపి కబురు చెప్పడంతో బుధవారం నుంచి కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమైంది.

● మొత్తం ఆరు రకాల సదుపాయాలు

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రైస్‌కార్డులో.. మొత్తం ఆరు రకాల సేవలను అందుబాటులోకి తెచ్చింది. కొత్తగా పెళ్లి చేసుకున్నవారికి నూతన కార్డులు, అడ్రస్ మార్పు, కార్డుల విభజన, కొత్త సభ్యుల చేరిక, చిరునామా మార్పు, మరణించిన వారి పేర్ల తొలగింపు, ఇటీవల పుట్టిన చిన్నారుల పేర్ల నమోదుతోపాటు.. రైస్ కార్డు సరెండర్ వంటి సదుపాయాలకు అవకాశం కల్పించింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో దర ఖాస్తు ప్రక్రియ ఉంటుంది. ఈ నెల 7 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకూ నెలరోజుల పాటు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

● అర్హతలు ఇలా..

కొత్తగా వివాహం చేసుకున్న జంట, ప్రస్తుతం రేషన్‌కార్డులో లేని కుటుంబాలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు, విడిపోయినవారు, తగిన అడ్రస్ ప్రూఫ్ ఉంటే వలసవచ్చిన వారు, నిరాశ్రయులు.. రైస్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చు. విధిగా హౌస్‌హోల్డ్ మ్యా పింగ్‌లో నమోదై ఉండాలి. అలా లేకుంటే కార్డు పొం దేందుకు అనర్హులవుతారు. ఒకవేళ నమోదైనా దర ఖాస్తుదారు ఒకే కుటుంబ సభ్యుడిగా హౌస్ హోల్డ్ లో నమోదైనా వారు అనర్హులవుతారు. ఇన్‌కమ్ టా క్స్ రిటర్న్ చెల్లింపు దారులు, ప్రభుత్వ ఉద్యోగులు రైస్ కార్డులు పొందడానికి అనర్హులు.

● కావాల్సిన పత్రాలు

రైస్ కార్డుకు దరఖాస్తు చేసుకునేవారు ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం కోసం.. విద్యుత్ బిల్లు, ఓటరు గుర్తింపు కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో అనుబంధ సచివాలయానికి వెళ్తే.. అక్కడ డిజిటల్ అసిస్టెంట్ దరఖాస్తు ప్రక్రియను పూర్తిచేస్తారు.

● స్వయంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు

పౌర సరఫరాల శాఖ వెబ్‌సైట్‌లోకి వెళ్లి అక్కడ కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కార్డు కావాల్సిన 'కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోండి'పై క్లిక్ చేయాలి. కుటుంబ, వ్యక్తిగత వివరాలు నమోదు చేయాలి. కావాల్సిన పత్రాలు అప్లోడ్ చేయాలి. దరఖాస్తు ప్రక్రియ పూర్తయిన తరువాత రసీదు నంబరు వస్తుంది. దాని ద్వారా అప్లికేషన్‌ను ట్రాక్ చేసుకోవచ్చు. ఏపీ రేషన్ కార్డు పోర్టల్‌లో అప్లికేషన్ ను ట్రాక్ చేయవచ్చు. లేదంటే 1967/1800-425- 8585 నంబర్ల ద్వారా సమాచారం పొందవచ్చు. దీంతోపాటు వాట్సాప్ గవర్నె న్స్ లింక్ ద్వారా కూడా రేషన్ కార్డుకోసం దరఖాస్తు చేసుకోవచ్చు. మే 12 నుంచి ఇది అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు.

రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు 50 శాతం పూర్తి

◆ రేపల్లె స్టేషన్ పనులు పరిశీలించిన డీఆర్‌ఎం సుధేష్ణసేన్ ◆ 22 భోగీలతో రేపల్లె టు తిరుమల రైలు

రేపల్లె, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఐదు రైల్వేస్టేషన్లను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ తెలిపారు. పథకంలో భాగంగా రేపల్లె రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె బుధవారం పరిశీలించారు. నూతన భవనాలు, పెంచిన ప్లాట్‌ఫాంలు, టిక్కెట్ బుకింగ్ కౌంటర్ భవనాలు, సిగ్నలింగ్ వ్యవస్థను పరిశీలించారు. అనంతరం అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలించి, పురోగతిని తెలుసుకున్నారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమృత్ భారత్ పథకంలో భాగంగా రేపల్లె, పిడుగురాళ్ల, తెనాలి, బాపట్ల, గుంటూరు స్టేషన్‌లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే సుమారు 50 శాతం పైనే పనులు పూర్తయ్యాయని డీఆర్‌ఎం వెల్లడించారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రేపల్లె నుండి వయా కడప మీదగా తిరుపతి వెళ్లే రైలు భోగీలు పెంచే ఆలోచన ఉందని తెలిపారు. దానికి అనుగుణంగా 22 భోగీలకు ప్లాట్‌ఫాం పెంచి కట్టాలని అధికారులకు సూచించారు. దానికి అన్ని అనుమతులు ఇస్తామని తెలిపారు. అభివృద్ధి పనులు పూర్తయ్యితే కొత్త ట్రైన్లు వచ్చే విధంగా చూస్తామన్నారు. తెనాలి-రేపల్లె మార్గంలో రెండు లేన్‌లు వేస్తే బాగుంటుందని స్థానిక నాయకులు, ప్రజాసంఘాలు డీఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లారు. వాటిపై అధ్యాయనం చేసి చర్యలు తీసుకుంటామని ఆమె సమాధానం ఇచ్చారు. స్టేషన్‌లో వసతుల కొరతపై పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సీవీ మోహన్‌రావు, రైళ్ల సర్వీసులను పెంచాలని పట్టణ ఆదర్శ వేదిక కార్యదర్శి యడ్లపల్లి కిషోర్‌బాబు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవోఎం శ్రీనాథ్, డీఈఎన్ శేషు, డీఈడబ్ల్యూ సుదర్శన్ నాయక్, గోపీచంద్ పాల్గొన్నారు.



వేమూరు రైల్వేస్టేషన్‌లో రెండో ప్లాట్ ఫాంపై స్థలాన్ని పరిశీలిస్తున్న రైల్వే డీఆర్‌ఎం సుదేష్ణసేన్

గూడ్స్ షెడ్ నిర్మాణానికి స్థల సేకరణ అవసరం:డీఆర్‌ఎం

వేమూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): వేమూరు నియోజకవర్గ పరిధిలోని రైతులు, వ్యాపారుల సౌకర్యార్థం రూ.9.98 కోట్లతో గూడ్స్ షెడ్డు నిర్మాణానికి స్థల సేకరణ అవసరమని, అందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని రైల్వే డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె ప్రత్యేక రైలు భోగీల్లో వేమూరు స్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్ పరిసరాలను, సౌకర్యాలను పరిశీలించారు. 2వ ప్లాట్ ఫాం వైపు ఏర్పాటు చేయనున్న గూడ్స్ షెడ్డు నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ప్లానింగ్ మ్యాప్‌తో ఇంజినీరింగ్ అధికారులు ఆమెకు వివరాలు తెలిపారు. ప్లాట్‌ఫాంపై తాగునీటి సౌకర్యం, బల్లలను తక్షణమే ఏర్పాటు చేయాలని డీఆర్‌ఎం అధికారులను ఆదేశించారు.

ఏపీ సీపీడీసీఎల్ టెక్నికల్ డైరక్టర్‌గా మురళీకృష్ణయాదవ్ బాధ్యతల స్వీకారం



గుంటూరు, మే 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ టెక్నికల్ డైరక్టర్‌గా ఆవుల మురళీకృష్ణయాదవ్ నియమి తులయ్యారు. ఈ మేరకు బుధవారం విజయవాడలోని కార్పొరేట్ కార్యాలయం లోని చాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ కార్పొరేట్ కార్యాలయంలో సీజీఎంగా మురళీకృష్ణ ఉద్యోగ విరమణ చేశారు. ఆయన సేవలను, సమర్థతను గుర్తించిన ప్రభుత్వం తాజాగా సీపీడీసీఎల్ టెక్నికల్ డైరక్టర్‌గా నియమించింది. గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, పలువురు అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

జీజీహెచ్‌ను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతాం

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు మెడికల్, మే 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో రోగులకు చక్కటి వైద్య సేవలు అందిస్తూనే.. రాష్ట్రంలోనే అత్యుత్తమ వైద్య బోధనాసుపత్రిగా తీర్చిదిద్దుతామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.



వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్

బుధవారం ఆసుపత్రి శుశృత హాల్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.65 లక్షలతో అందజేసిన నేత్ర వైద్య పరికరాలను ఆయన ప్రారంభించారు. అలాగే గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం (జింకానా) చైర్మన్ ఆఫ్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ డాక్టర్ రవికుమార్ త్రిపురనేని విరాళంగా అందజేసిన రూ.20 లక్షల విలువైన గ్యాస్ట్రో ఎంటరాలజీ, మత్తు మందు వైద్య పరికరాలను మంత్రి పెమ్మసాని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్‌ఎస్‌వీ రమణకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రీజినల్ హెడ్ పవన్‌కుమార్‌ను, డాక్టర్ రవికుమార్ త్రిపురనేనిని మంత్రి పెమ్మసాని, కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు సన్మానించారు. ఇకపై ఏటా రూ.5 కోట్లను గుంటూరు జీజీహెచ్‌కు కేటాయించేలా కృషి చేయాలని పవన్‌కుమార్‌కు మంత్రి పెమ్మసాని సూచించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రమణ మాట్లాడుతూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అందజేసిన ఆప్టికల్స్ కోహ్యారెన్స్ టోమోగ్రఫీ, విజువల్ ఫీల్డ్ ఎనలైజర్, నాన్ కాంటాక్ట్ టోనోమీటర్ వంటి వైద్య పరికరాలతో నీటి కాసులు జబ్బుకు మెరుగైన వైద్య అందించే వెసులుబాటు కలుతుందన్నారు. డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్ పోతురాజు సమత, ప్రొఫెసర్ రవిబాబు, ఉండవల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు జాతి పూర్వ వైభవానికి ప్రభుత్వ సహకారం

● రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



విజేతకు ద్విచక్రవాహనాన్ని అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తదితరులు

పొన్నూరుటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): ఒంగోలు జాతి ఎడ్ల పూర్వ వైభవానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సాయం చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వడ్లమూడి గ్రామంలో ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మెమోరియల్ జాతీయ స్థాయి వృషభరాజాల బలప్రదర్శన పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ఒంగోలు జాతి ఖ్యాతి ఖండాంతరాలు దాటిందని పేర్కొన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి చేసిన కృషి. ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. సంగం డెయిరీ అభివృద్ధి ద్వారా వేల కుటుంబాలు ఆర్థికంగా బలపడ్డాయన్నారు. వీరయ్య చౌదరి వారసుడిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఒంగోలు జాతి ఎడ్ల ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ రైతు బాంధవుడు ధూళిపాళ్ల వీరయ్య చౌదరి అని కొనియాడారు. జూనియర్స్ విభాగంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ఎడ్లు పోటీ పడ్డాయి.

ఒంగోలు జాతి ఎడ్ల మనుగడను కాపాడుకుందాం

ఒంగోలు జాతి ఎడ్ల మనుగడను కాపాడుకుందామని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుండి 150 జతల ఎడ్లు పాల్గొనేందుకు వచ్చాయని తెలిపారు. బాలకోటేశ్వరస్వామి ఆశీస్సులు.. ఎన్టీరామారావు, వీరయ్య చౌదరి స్ఫూర్తితో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ గౌరవానికి, ఆత్మప్రతీకకు నిలిచే ఒంగోలు జాతి ఎడ్లు అంతరించిపోయే దశలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ అర్బన్ డెవలంప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వడ్రాణం మార్కండేయబాబు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా పోటీలు కొనసాగించి, ఎడ్ల పోషకులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమంలో భాగం డిస్పెన్సరీలు

● ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

నరసరావుపేట టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాల్లో డిస్పెన్సరీల నిర్మాణం ఒకటని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు. బుధవారం నరసరావుపేటలో ఏపీఎస్ ఆర్టీసీ డిస్పెన్సరీ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనకళ్ల మాట్లాడుతూ ఇటీవలే మచిలీపట్నంలో డిస్పెన్సరీని ప్రారంభించినట్లు తెలిపారు. మొదటి నుంచి ఆర్టీసీతో అవినావభావ సంబంధం ఉందని, తాను ట్రేడ్ యూనియన్ నాయకుడిగా పనిచేశానని గుర్తుచేసుకున్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం తర్వాత కొన్ని జబ్బులకు మాత్రమే వైద్య సదుపాయం ఉందని పేర్కొన్నారు. ఆర్టీసీకి ఏ విధంగానైనా.. సేవలు అందించడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ రూ.84 లక్షల వ్యయంతో డిస్పెన్సరీ నిర్మించినట్లు తెలిపారు. ట్రై కాగ్ మిషన్ ద్వారా 1,200 మందిని రక్షించినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు మా ట్లాడుతూ డిస్పెన్సరీలో పీ4 ద్వారా ఏసీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జోన్-3 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.నాగేంద్ర ప్రసాద్, జోనల్ చైర్మన్ ఎస్.సురేష్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి ఎం.మధు, డీఎం శ్రీనివాసరావు, ఇతర ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎండీ ద్వారకా తిరుమలరావు, ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	147, 156, 167
చికెన్ విత్ స్కిన్(కిలో)	284.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	294.00

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

చిలకలూరిపేట, మే7 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని కుక్కపల్లివారిపాలెం గ్రామ పరిధిలో జరిగింది. ఈ ఘటనలో 8 గొర్రెలు కూడా మృతి చెందాయి. మృతుడు పెదనందిపాడు మండలం జరుగులవారి పాలేనికి చెందిన ఒంటిపులి అంకమ్మ (70)గా గుర్తించారు. సాయంత్రం ఒక్కసారిగా వర్షంతో పాటు పిడుగులు కూడా పడ్డాయి. రాత్రి అయినా గొర్రెల కాపరి అంకమ్మ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుక్కుంటూ వెళ్లగా.. ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే మృతుడి కుటుంబ సభ్యులు వీఆర్‌ఓ కు సమాచారం అందించారు.

టింబర్ డిపోకు రూ. 3 లక్షల పెనాల్టీ

గుంటూరు సిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని టింబర్ డిపోలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. నరసరావుపేట మండలం కేశానుపల్లి గ్రామంలోని శ్రీ విజయ టింబర్ డిపో అండ్ సామిల్‌లో అనుమతులు లేకుండా భారీ మొత్తంలో నిల్వ ఉంచిన దరిసనం, గుమ్మడి టేకు దుంగలను గుర్తించారు. ఎటువంటి బిల్లులు లేకపోవడంతో... యజమాని మురళీధర్‌రెడ్డికి రూ. 3 లక్షల పెనాల్టీ విధించారు. ఇన్‌స్పెక్టర్ పల్లపు శివాజీ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సైదులు, నర్సరావుపేట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నీలిమ దేవి పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో కూలీ మృతి

గుంటూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధి అశోక్‌నగర్ 3వ లైన్‌లో బుధవారం విద్యుదాఘాతంతో రోజువారి కూలీ ఏటూరి తిరుపతిరావు (27) మృతి చెందాడు. ఓ ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నాడు. డ్రమ్ములలోని నీటిని మోటర్ ద్వారా తోడుతుండగా కరెంట్ షాక్‌కి గురయ్యాడు. వెంటనే తిరుపతిరావును జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని సోదరుడు వీరాంజనేయులు ఫిర్యాదు మేరకు.. పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

98,525 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 93,868 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 98,525 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 32,808 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	14000
334	9500	13300	షార్క్-1	10000	12000
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	10000	12500	సింజెంటా బ్యాడిగి 5531	---	---
341	10000	13200			
4884	10000	11200	దేవనూరుడీలక్స్	10000	12500
సూపర్10	10000	12500	ఆర్మూరు	9800	11200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తాలుకాయలు	4500	6500

తొమ్మిది మంది ఫీల్డ్ అసిస్టెంట్‌ల తొలగింపు

నరసరావుపేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన జిల్లాలో తొమ్మిది మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లను విధుల నుంచి తొలగించినట్లు డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి బుధవారం తెలిపారు. ఒక పనికి సంబంధించిన ఐడీ ఫొటోను వివిధ పనుల ఐడీలకు అప్‌లోడ్ చేసినట్టు ఎన్‌ఎంఎంఎస్ నివేదిక ద్వారా నిర్ధారించినట్టు చెప్పారు. మాడుగుల, బెల్లంకొండ, కొప్పునూరు, ఇర్లపాడు, శావల్యాపురం, వెల్లటూరు, రెమిడిచర్ల, పిట్టంబండ, దొండపాడు ఫీల్డ్ అసిస్టెంట్‌లను విధుల నుంచి తాత్కాలికంగా తొలగించినట్టు వివరించారు.

హజ్ యాత్రపై సన్నాహక సమావేశం

చిలకలూరిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక హుందా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ అబ్బాస్ ఖాన్ ఆధ్వర్యంలో పట్టణంలోని గుర్రాలచావడిలో హజ్ యాత్రకు వెళ్లే వారి కోసం బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పవిత్ర మక్కా నగరంలో సందర్శించవలసిన ప్రదేశాలు, వాటి ఔన్నత్యాన్ని, హజ్ యాత్ర వల్ల పొందే పుణ్య ఫలాల గురించి, ఇస్లాం శాంతి సందేశాన్ని గురించి ఆయన ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో ముఫ్తీ అనస్ ఖాన్ నద్వి (గవర్నమెంట్ ఖాజీ), సనా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు యూసుఫ్ అలీ(లక్కీ రోడ్ లైన్స్), మాజీ కౌన్సిలర్ బషీర్ మేస్త్రి, అంజుమన్ ఉపాధ్యక్షులు జాఫర్‌ఖాన్, పఠాన్ తలహాఖాన్, ఇస్లాం ధార్మిక పండితులు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి కల్పించండి : వీఆర్‌ఏలు

ఈపూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వీఆర్‌ఏలకు పదోన్నతి కల్పించాలని వీఆర్‌ఏలు బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి మురళీకి వినతిపత్రం అందజేశారు. ఖాళీగా ఉన్న సబార్డినేటర్, నైట్ వాచ్‌మన్ పోస్టులను వీఆర్‌ఏలతో భర్తీ చేయాలన్నారు. స్పందించిన డీఆర్‌వో వెంటనే అర్హుల జాబితాను తెప్పించుకొని వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారని వీఆర్‌ఏలు అన్నారు. డీఆర్‌వోకు వినతిపత్రం అందజేసిన వారిలో రాష్ట్ర వీఆర్‌ఏ అసోసియేషన్ అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ జానీ, ధూపాటి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పిచ్చికుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

నూజెండ్ల, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీ వాసులపై మంగళవారం రాత్రి పిచ్చి కుక్క దాడి చేసిన ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ దాడిలో మల్లవరపు వెంకటేశ్వర్లు, అంకమ్మ, చలంచర్ల అప్పారావులను వ్యాక్సినేషన్ కోసం 108 వాహనంలో వినుకొండకు తరలించారు. గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువైందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేమిడిచర్లలో కంటి వైద్యశిబిరం

బొల్లాపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో ఆమ్‌ఆద్మీ పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శి పొలిమేర రూబేన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాదు కంటి ఆస్పత్రి సహకారంతో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 186 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రేమి ఫౌండేషన్ అధ్యక్షులు హైదరాబాద్ సహకారంతో కళ్ళ జోళ్ళు పంపిణీ చేశారు. 16 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ఆమ్ ఆద్మీ పార్టీ జోనల్ కో-ఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు, ఆర్‌ఎంపీ సిద్దయ్య, బారెడ్డి కృష్ణారెడ్డి, టీ నరసింహారావు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు నివాళి



చిలకలూరిపేటలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

చిలకలూరిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం వివిధ వర్గాల వారి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి, విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు తోటకూర వెంకట నారాయణ, కరణం వెంకటశివ, ఉప్పుటూరి ప్రసాద్, గల్లా సాంబశివరావు, తదితరులు స్థానిక ఎన్‌ఆర్‌టీ సెంటర్లో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనునాయక్, సలికినిడి నాగరాజు, పుట్టా వెంకట బుల్లోడు, కంచర్ల శ్రీనివాసరావు, చందవరం హరిప్రసాద్, చరణ్ తేజ, శ్యాముల్ పాల్ పాల్గొన్నారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సంఘ సేవకుడు చొక్కా విన్సెంట్ పాల్ అల్లూరి జీవిత విశేషాలు వివరించారు. కాంగ్రెస్ నాయకులు ఎం రాధాకృష్ణ, షేక్ నస్రుద్దీన్, ఇంటూరి భవాని వెంకటేష్, కారుచోల స్వప్నకుమార్, పల్లెపోగు రాజు, శ్యాంబాబు పాల్గొన్నారు.

● **వినుకొండ, (ఆంధ్రజ్యోతి):** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని బుధవారం నిర్వహించారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో అల్లూరి సీతారామరాజు చేసిన సేవల గురించి తహసీల్దార్ సురేష్ వివరించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీ మురళి, ఆర్‌ఐ శ్రీహరి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో మహిళలకు ఆర్థిక పురోగతి

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు
- మొదటి విడతగా 285 మందికి శిక్షణ
- ముగిసిన అనంతరం మిషన్ల పంపిణీ



శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాషువా కళాప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కుట్టుమిషన్ శిక్షణ ద్వారా మహిళల ఆర్థికప్రగతికి బాటలు పడతాయన్నారు. రూ.255కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా లక్ష మందికి మేలు జరగబోతుందని, బీసీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 46 వేల మందికి, ఆర్థికంగా వెనుకబడిన ఇతర కులాల వారికి 56,700 మందికి ప్రభుత్వం కుట్టుశిక్షణ ప్రారంభిస్తుందని, దీనికోసం రూ. 255 కోట్లు ప్రభుత్వం కేటాయించడం శుభపరిణామన్నారు. ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో కుట్టు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. మహిళలు ఇంటి వద్దనే ఉపాధి, ఆదాయం పొందేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమం ఎంతగానో దోహదపడతుందన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా మొదటి విడత కార్యక్రమంలో భాగంగా 285 మందికి ఈ శిక్షణ కార్యక్రమం 45 నుంచి 90 రోజుల పాటు అందిస్తామన్నారు. శిక్షణ పొందిన వారికి కుట్టు మిషన్లు ఇస్తామన్నారు. దీని ద్వారా మహిళలు ఇంటి వద్ద నుంచే రూ.5వేలు నుంచి రూ.15వేలు వరకు ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకునే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో పాటు మున్సిపల్ చైర్మన్ దస్తగిరి, కమిషనర్ సుభాష్ చంద్రబోస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం.. పంటలకు నష్టం



సొలసలో దెబ్బతిన్న బొప్పాయి తోట

యడ్లపాడు, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. వడగండ్ల వానతో వీచిన ఈదురు గాలులతో పలు చోట్ల వృక్షాలు రోడ్డుపైన అడ్డుపడ్డాయి. బోయపాలెం - చంఘీస్‌ఖాన్‌పేట మార్గంలో సంగం గోపాలపురం వద్ద భారీ వృక్షాలు నేలకొరగటంతో రాకపోకలకు అంతరాయం కలిగాయి. కొన్ని చోట్ల చెట్లు పడటంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. సొలస, చంఘీజ్ ఖాఖాన్‌పేట, కొండవీడు గ్రామాల పరిధిలో బొప్పాయి, అరటి తోటలు నేలవాలాయి. మామిడి కాయలు కూడా రాలి పోవటంతో రైతులకు నష్టం వాటిల్లింది.

వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు



కన్యకా పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, మహిళలు , భక్తులు

నరసరావుపేట టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మల్లమ్మ సెంటర్లో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల (ఆంధ్రజ్యోతి): రొంపిచర్లలో ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి జన్మదిన వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమ పూజలను నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక అలంకరణ చేశారు.

● బొల్లాపల్లి (ఆంధ్రజ్యోతి): వెల్లటూరు శ్రీఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవి క్లబ్ వైభవ్ ఆధ్వర్యంలో వాసవీ అమ్మవారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గజ్జవల్లి వెంకట సుబ్బయ్య, అర్వపల్లి సుబ్రహ్మణ్యం, కజ్జాయం లక్ష్మీనారాయణ, దేసు కోటేశ్వరరావు, గజ్జవల్లి శ్రీను, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో పోషక లోపాలు అధిగమించాలి

● జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి



భూసార పరీక్షా నమూనాల సేకరణపై సూచనలు చేస్తున్న డీడీఏ ఎం శివకుమారి

వినుకొండటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ రైతు పొలాల్లో రైతులకు భూసార మట్టి నమూనా సేకరణ విధానం, దాని ఆవశ్యకత గురించి పల్నాడు జిల్లా వనరుల కేంద్రం అధికారి శివకుమారి తెలిపారు. వ్యవసాయాధికారి వరలక్ష్మి ఆధ్వర్యంలో రైతుల పొలాల్లో 8చోట్ల మట్టి నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో ఏఈవో సునీత, వ్యవసాయ సిబ్బంది, ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● శావల్యాపురం (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో రైతులు పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకొని భూమిలోని పోషక లోపాలను తెలుసుకొని వాటిని అధిగమించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి అన్నారు. వ్యవసాయ సిబ్బంది శావల్యాపురంలోని రైతుల పొలాల్లో బుధవారం మట్టినమూనాలు సేకరించారు. ఇన్‌చార్జి ఏవో, ఏఈవో, వీఏఏలు పాల్గొన్నారు.

● నూజెండ్ల (ఆంధ్రజ్యోతి) : రైతుల భూముల్లో భూసార పరీక్షలను నిర్వహించే మట్టి నమూనాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించాలని డీడీఏ ఎం శివకుమారి అన్నారు. మండలంలోని ఉప్పలపాడు, తలార్లపల్లి రైతు సేవాకేంద్రాల పరిధిలో వ్యవసాయ శాఖ సిబ్బంది చేపట్టిన భూసార పరీక్ష, మట్టి నమూనా కార్యక్రమాన్ని డీడీఏ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు, వీహెచ్‌ఏ తేజస్వి, రైతులు పాల్గొన్నారు.

● ఈపూరు (ఆంధ్రజ్యోతి): భూమిలో ఉన్న లోపాలను గుర్తించి తగిన పోషకాలు అందించడం వల్ల నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని డీడీఏ శివకుమారి అన్నారు. మండలంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మట్టి నమూనాలను సేకరించే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆర్ రామారావు, విస్తరణాధికారి అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి

యడ్లపాడు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సొలస గ్రామంలో బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామంలోగల గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో బ్రహ్మంగారి ఆరాధనా మహోత్సవాల్లో భాగంగా బుధవారం మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

● రొంపిచర్ల (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రొంపిచర్ల, కర్లకుంట, సంతగుడిపాడు గ్రామాల్లో ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం బుధవారం వైభవంగా జరిగింది.

● ఈపూరు (ఆంధ్రజ్యోతి): మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. కొచ్చెర్ల, ముప్పాళ్ళ, కొండ్రముట్ల, అంగలూరు గ్రామాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొచ్చెర్లలో సాయంత్రం కోలాటం వేశారు.

● బొల్లాపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరుపాడు, గంగుపల్లి, మూగచింతలపాలెం తదితర గ్రామాల్లో బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయా దేవాల యాల వద్ద భారీ అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం బ్రహ్మంగారి జీవిత చిత్రను నాటక ప్రదర్శన నిర్వహించారు.

● నూజెండ్ల (ఆంధ్రజ్యోతి) : నూజెండ్ల, వీ అప్పాపురం, గొల్లపాలెం, పమిడిపాడు తదితర గ్రామాల్లో బుధవారం శ్రీపోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్ర స్వామి, మాతా గోవిందాంబ స్వామి వార్లకు పంచామృతాభిషేకాలు, విశేష అలంకరణ, కళ్యాణోత్సవంతో రాత్రి సమయంలో దేవతా విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.

● నరసరావుపేట టౌన్ (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీరామపురంలో ఉన్న ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 12 మంది దంపతులచే బ్రహ్మంగారి యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఎన్ కళాశాలలో జాబ్‌మేళా



ఎంపికైన విద్యార్థులతో కళాశాల అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, సెక్రటరీ నాగసరపు సుబ్బరాయగుప్తా తదితరులు

నరసరావుపేట టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎస్‌ఎన్ కళాశాలలో బుధవారం దివీస్ లాబొరేటరీస్ నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైందని ప్రిన్సిపాల్ ఎంఎస్ సుధీర్ తెలిపారు. జాబ్‌మేళాలో మొత్తం 32 మంది పాల్గొనగా 11 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల కమిటీ అధ్యక్షుడు కపిలవాయి విజయ్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా ఆఫర్ లెటర్‌లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీ శ్రీనివాససాయి, కంపెనీ హెచ్‌ఆర్ హరికృష్ణ, పీడీ డిపార్టుమెంట్ ఇన్‌చార్జి బీ ఆదిలక్ష్మి, బీ శ్రావణి, ఐ సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేకవేదికపై స్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

యడ్లపాడు, మే 7 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు శ్రీరాజరాజేశ్వర స్వామి ఆల యం 8వ వార్షిక వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భం గా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు కంద్రిక, యడ్లపాడు, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు ఆల య ప్రాంగణంలో కోలాట ప్రదర్శనతో భక్తులను అలరించారు. అనంతరం 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై శివపార్వతుల శాంతి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. కోటప్పకొండకు చెందిన పండితులు కొండకావూరి అప్పయ్య గురుకుల్, ప్రసాద్‌శర్మల పర్యవేక్షణలో అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణ వేడుకలను నిర్వహించారు. వేడుకల్లో వేదిక అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, అరుణకుమారి దంపతులు పాల్గొని కల్యాణ పూజలు నిర్వహించారు.

టీడీపీ గ్రామ కమిటీల ఎన్నిక



రవ్వవరంలో నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీలను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

నూజెండ్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుచ్చనూతల పంచాయతీ పరిధిలోని గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు మంగళవారం రాత్రి గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. రవ్వవరంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడిగా గౌరబోయిన శివయ్య, ఉపాధ్యక్షుడిగా ఓబుళాపురం బాల నాయుడును ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీలను టీడీపీ మండల అధ్యక్షుడు మీసాల మురళీకృష్ణ యా దవ్, నాయకులు లగడపాటి వెంకటరావు, వంకాయలపాటి పేరయ్య, గంగినేని బాబు, బచ్చు అంజిరెడ్డి, మరిడి సురేష్, బొట్ల అంజయ్య తదితరులు అభినందించారు.

పురుషోత్తమపట్నం నూతన కమిటీ ఎన్నిక

చిలకలూరిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురుషోత్తమపట్నంలో వార్డులకు నూతన కమిటీ ఎన్నిక జరిగింది. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొత్త కార్యవర్గాన్ని బుధవారం అభినందించారు. అధ్యక్షుడిగా బైరా వెంకట కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా సాకిరి నాగార్జున, ఉపాధ్యక్షుడిగా దేవిరెడ్డి భాస్కరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా తోట మురళీమోహన్, మేకల నాగరాజు, దేవిరెడ్డి రాజేంద్రప్రసాద్, కార్యదర్శులుగా తోట వెంకట సుబ్బారావు, తేలప్రోలు బ్రహ్మస్వాములు, కోనపురెడ్డి బాలచంద్రుడు, కోశాధికారిగా తేలప్రోలు శ్రీనివాసరావు, బూత్ కన్వీనర్లుగా బైరా వెంకట శ్రీనివాసరావు, అచ్చుకోల నాగబాబు ఎన్నికయ్యారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 7(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం బుధవారం నాటికి 513.90 అడుగులు ఉంది. ఇది 138.38 టీఎంసీలకు సమానం. ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల...

అచ్చంపేట, మే 7(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 22.79 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

సైనికుల పోరాట పటిమకు ప్రతీక ఆపరేషన్ సింధూర్

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): భారతసైన్యం అసమాన పోరాట పటిమకు ప్రతీక ఆపరేషన్ సింధూర్ అని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కొనియాడారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ సైనిక చర్య ద్వారా త్రివర్ణ దళాలు ప్రదర్శించిన అసాధారణ ధైర్య సాహసాలు, నిబద్ధతను హృదయ పూర్వకంగా అభినందిస్తున్నానన్నారు. శాశ్వతంగా ఉగ్రపీడను నివారించి దేశ భద్రతను కాపాడేందుకు అత్యంత కీలకమైన చర్యగా ఆపరేషన్ సింధూర్‌ను అభివర్ణించారు. ఈ ఆపరేషన్ విజయవంతం కావటానికి దిశ, నిర్దేశం చేసిన ప్రధాని నరేంద్రమోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రూ.35 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని 25 మందికి రూ.35 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) మొత్తపు చెక్కులను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన ఖరీదైన, నాణ్యమైన వైద్యసేవలు పొందలేని పేద మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ సహాయం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు కాగా ముందస్తు వైద్యసేవలకు అవసరమైన రూ.5 లక్షల ఎల్వోసీని కూడా ఆయన సంబంధిత కుటుంబాల వారికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరీముల్లా, జవ్వాజి మదన్ మోహన్, కామినేని సాయిబాబు, సమద్‌ఖాన్, రవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో మేజర్ డ్రైన్స్‌లో సిల్టు తొలగింపు

నరసరావుపేట టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో రూ.40 లక్షలతో మేజర్ డ్రైన్స్‌లో సిల్టు తొలగించు కార్యక్రమం చేపడతామని కమిషనర్ ఎం జస్వంత్ బుధవారం తెలిపారు. లోతట్టు ప్రాంతాలు అయిన 5వ వార్డులో గల క్రిష్టియన్‌పాలెం, 34వ వార్డులో గల బీసీ కాలనీ, 1వ వార్డులో ఉన్న చంద్రబాబునాయుడు కాలనీ, 7వ వార్డులో గల పులివాగులో ఉన్న మేజర్ డ్రైన్‌లో గల సిల్టును జెసీబీలతో తొలగించి కాలువల నందు మురుగునీరు సక్రమంగా పారుదల జరుగుటకు చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే వర్షాకాలం దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా పట్టణంలో గుర్తించిన లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి ఎటువంటి సంఘటనలు జరుగకుండా ముందుగానే మేజర్ డ్రైన్‌లలో సిల్టు తొగించు కార్యక్రమం చేపడతామన్నారు. ఈ నెల 31లోగా ఆయా పనులు పూర్తి చేస్తామన్నారు.

జాతీయ స్థాయి పౌరాణిక పద్య ఏకపాత్రాభినయ పోటీలు

● గోరంట్ల సింగర కొండయ్య చౌదరికి ప్రథమ బహుమతి



కొండయ్య చౌదరిని అభినందిస్తున్న పోటీల నిర్వాహకులు

చిలకలూరిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : రొంపిచర్ల మండలం బుచ్చి పావన్న పాలెంలో జరిగిన జాతీయ స్థాయి పౌరాణిక పద్య ఏకపాత్రాభినయ పోటీల్లో చిలకలూరిపేట మండలం మద్దిరాల గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి గోరంట్ల సింగర కొండయ్య చౌదరి ప్రథమ బహుమతి పొందారు. ఈ సందర్భంగా చౌదరిని పలువురు అభినందించారు. వారిలో ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవిందబాబు, టీడీపీ సీనియర్ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరీముల్లా, చిట్టిపోతు మస్తానయ్య, పేర్ని వీరనారాయణ, నాతాని ఉమామహేశ్వరరావు, జక్కంపూడి సీతారామారావు, జంపని భాస్కరరావు, తేలప్రోలు వీరయ్య చౌదరి, షేక్ ఉమర్ తదితరులు ఉన్నారు.

అసంఘటిత రంగానికి ఉచిత న్యాయ సహాయం

ప్రిన్సిపల్ సివిల్ జడ్జి నరేంద్రరెడ్డి



నూలు మిల్లులో మాట్లాడుతున్న జడ్జి నరేంద్రరెడ్డి

యడ్లపాడు, మే 7 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) కే నరేంద్రరెడ్డి అన్నారు. మండలంలోని యడ్లపాడు గ్రామ పరిధిలో గల ఎన్‌ఎస్‌ఎల్ నూలు మిల్లులో కార్మికులకు వివిధ అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు కార్మిక చట్టాలు, కనీస వేతనాల హక్కులు, బాలక కార్మిక నిషేధ చట్టం తదితర విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయ సహాయం అవసరమైన వారు ముందుకు రావాలని సూచించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీహెచ్‌ఎస్ ప్రసాదు, న్యాయవాదులు వెంకటేశ్వరరావు, రాజేష్, పారా లీగల్ వలంటీరు జాషువా, ఏఎస్ఐ వెంగయ్య, మిల్లు జీఎం నరసింహం తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా గ్రంథాలయశాఖ కార్యదర్శి వెంకట సుబ్బరత్తమ్మ



గ్రంథాలయంలో రికార్డులు తనిఖీ చేసున్న జిల్లా కార్యదర్శి వెంకట సుబ్బరత్తమ్మ

శావల్యాపురం, మే 7(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులంతా సద్వినియోగించుకొని నైపుణ్యాలను సాధించాలని జిల్లా గ్రంథాలయశాఖ కార్యదర్శి వంకదారి వెంకట సుబ్బరత్తమ్మ అన్నారు. శావల్యాపురంలోని శాఖా గ్రంథాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. రోజుకు గ్రంథాయాలనికి హాజరవుతున్న సభ్యుల సంఖ్య, గ్రంథాలయంలోని సమస్యలు, వేసవి శిక్షణ తరగతుల నిర్వహణపై సిబ్బందిని ఆరా తీశారు. విద్యార్థుల సామర్థ్యాలను తనిఖీ చేసి సూచనలు ఇచ్చారు.

సంతగుడిపాడులో వేసవి శిక్షణ తరగతులు

రొంపిచర్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం విద్యార్థులతో పుస్తక పఠనం, కలర్స్ చేయటం జరిగిందని ఇన్‌చార్జ్ గ్రంథాలయ అధికారి వెంకటరావు తెలిపారు.

సొసైటీ సేవలను రైతులు సద్వినియోగించుకోవాలి

● శావల్యాపురం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి సురేంద్రబాబు

శావల్యాపురం(వేల్పూరు), మే 7(ఆంధ్రజ్యోతి): సొసైటీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతులంతా సద్వినియోగించుకొని ఆర్థికాభివృద్ధిని సాధించాలని శావల్యాపురం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి నర్రా సురేంద్రబాబు అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం- 2025లో భాగంగా మండలంలోని వేల్పూరు గ్రామంలోని కోల్డ్‌స్టోరేజీ వద్ద సొసైటీల్లో అమలవుతున్న కార్యక్రమాలు, కోల్డ్‌స్టోరేజీలు, గోదాములు, ధాన్యం నిల్వల నిర్వహణ తదితర అంశాలపై రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాద్ మాట్లాడుతూ శావల్యాపురం సొసైటీ ద్వారా మండలంలోని వేల్పూరులో కోల్డ్‌స్టోరేజీని, వేల్పూరు, పొట్లూరు, కొత్తలూరు, మతుకుమల్లి గ్రామాల్లో మల్టీ సర్వీస్ సెంటర్లను నిర్మించామని, రైతులంతా తమ పంటలను వాటిలో తక్కువ ధరలకు నిల్వ చేసుకోవాలని అన్నారు. సొసైటీ సిబ్బంది సుభాషిని, రామాంజి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.